# సాక్షి జగిత్యాల

గురువారం | 13 | మార్చి | 2025




## అంజన్న ఆలయంలో ముగిసిన పవిత్రోత్సవాలు



జగిత్యాల: కొండగట్టు అంజన్న ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. వేద పండితులు స్వామివారికి క్షీరాభిషేకం, సహస్ర నాగ వల్లి, దళఅర్చన, పట్టువస్త్రాలంకరణ, పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం దీపాలంకరణ చేపట్టారు. ఆలయ ఈవో శ్రీకాంత్, డిప్యూటీ కమిషనర్ కపిందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేందర్‌స్వామి పాల్గొన్నారు.

## రంజాన్ వేళలు

| | ఇఫ్తార్ గురువారం (సా॥) | సహర్ శుక్రవారం (ఉ॥) |
|---|---|---|
| కరీంనగర్ : | 6.28 | 5.06 |
| పెద్దపల్లి : | 6.31 | 5.04 |
| సిరిసిల్ల : | 6.26 | 5.14 |
| జగిత్యాల : | 6.31 | 5.04 |

## న్యూస్‌రీల్

### 14న మెట్‌పల్లిలో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

మెట్‌పల్లి: పట్టణంలోని మినీ స్టేడియంలో ఈనెల 14న జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను ఈనెల 23న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. అండర్–14, 16, 18, 20 విభాగాల్లో పోటీలు ఉంటాయని, ఆసక్తి గలవారు మధ్యాహ్నం మూడు గంటలకు అర్హతపత్రాలతో హాజరుకావాలని ఆయన సూచించారు.

### మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



కేక్ కట్ చేస్తున్న రఘువరణ్

జగిత్యాలరూరల్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి రఘువరణ్ అన్నారు. జగిత్యాల మండల ఐకేపీ కార్యాలయంలో బుధవారం మహిళాదినోత్సవాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. మహిళ సంఘాలకు ఇందిరామహిళ శక్తి కార్యక్రమం కింద ఆర్టీసీ బస్సులు, సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు రుణాలు ఇస్తోందన్నారు. డీపీఎం మాణిక్‌రెడ్డి, ఏపీఎం గంగాధర్, డీఎంసీ దేవయ్య, సీసీలు గంగారాం, మరియ, విద్యాసాగర్ పాల్గొన్నారు.

### ఉద్యోగ నోటిఫికేషన్లకు ఎస్సీ వర్గీకరణ వర్తింపజేయాలి



నిరసన దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు

జగిత్యాలటౌన్: ప్రభుత్వం విడుదల చేసే ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్‌లో ఎస్సీ వర్గీకరణ వర్తించేలా చట్టం తేవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాంమాదిగ అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ చట్టం తీసుకొస్తామని ప్రకటించిన నేపథ్యంలో గతంలో ఇచ్చిన ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్‌కు ఎస్సీ వర్గీకరణ వర్తించేలా చట్టానికి రూపకల్పన చేయాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ అయిన తర్వాతనే గ్రూప్–1, 2, 3, 4 సహా అన్ని ప్రభుత్వ ఉద్యోగ పరీక్ష ఫలితాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో నాయకులు నురుగు శ్రీనివాస్, బెజ్జంకి సతీష్, బోనగిరి కిషన్, నక్క గంగారాం, నక్క రమేష్, సంకెపు ముత్తు, కొల్లూరు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రాథమిక పాఠశాలల్లో 'ఏఐ' బోధన



అధికారులతో మాట్లాడుతున్న డీఈవో

జగిత్యాల: జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ ఉపయోగించి విద్యాబోధన చేయనున్నట్లు డీఈవో రాము తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. ఈనెల 15 నుంచి ఎంఈవోలు, అకాడమిక్ మానిటరింగ్ అధికారుల పర్యవేక్షణలో ఏఐ వాడటానికి అనుకూలంగా ఉండేలా కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా నుంచి నలుగురు ఉపాధ్యాయులకు ఏఐ ద్వారా వెనుకబడిన విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపర్చేలా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కో–ఆర్డినేటర్ రాజేశ్ పాల్గొన్నారు.

### రంగుమారిన తాగునీరు



రంగుమారిన నీరు

జగిత్యాల: జగిత్యాల మున్సిపల్ పరిధి 13వ వార్డు సుతారిపేటలో కొన్ని రోజులుగా తాగునీరు కలుషితం అవుతోంది. రంగుమారిన నీరు వస్తోందని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# డ్రైనేజీలు అస్తవ్యస్తం

- కరువైన మరమ్మతు
- కొత్తవి నిర్మించరు.. పాతవి పట్టించుకోరు
- శానిటేషన్ మరిచిన అధికారులు
- నరకం అనుభవిస్తున్న ప్రజలు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

జగిత్యాల: నూతన డ్రైనేజీలు నిర్మించరు.. ఉన్న వాటికి మరమ్మతు చేయరు అన్నచందంగా మారింది జిల్లాలోని మున్సిపాలిటీల తీరు. పాలకవర్గం ఉన్న సమయంలోనూ డ్రైనేజీలను పట్టించుకోకపోవడంతో మురికినీరంతా రోడ్లపైనే ప్రవహిస్తోంది. ప్రధానంగా జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, మున్సిపాలిటీల్లోని డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడంతో మురికినీరు రోడ్లపైకి చేరుతోంది. పర్యవేక్షించేవారు లేక పారిశుధ్య కార్మికులు వాటిపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. ప్రజలు కూడా ప్లాస్టిక్, చికెన్ వ్యర్థాలను డ్రైనేజీల్లోనే వేస్తున్నారు. సాయంత్రం ఆరుగంటలు దాంటిదంటే ప్రతిఒక్కరూ తలుపులు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు ఫాగింగ్ చేయకపోవడం, డ్రైనేజీల్లో ఆయిల్‌బాల్స్ వేయకపోవడంతో వ్యవస్థ అంతా అస్తవ్యస్తంగా మారింది.



ఇది జిల్లాకేంద్రంలోని బైపాస్‌రోడ్‌లోగల ప్రధాన కాలువ. డ్రైనేజీ సక్రమంగా లేకపోవడం.. కాలనీకి చెందిన కొందరు చెత్త పడేయడంతో నీరు కదలలేని పరిస్థితి. పరిసరాలన్నీ దుర్గంధం వెదజల్లుతున్నాయి. శుభ్రం చేయాల్సిన పారిశుధ్య కార్మికులు వారానికోసారైనా తీయడం లేదు. పందులు, దోమలు విజృంభిస్తున్నాయి. కాలనీవాసులు రోగాల పాలవుతున్నారు.



ఈ చిత్రం జిల్లాకేంద్రంలోని సాయిబాబా గుడి సమీపంలోని డ్రైనేజీ. పూడిక తీయక నెలలవుతోంది. నీరు కూడా వెళ్లడం లేదు. వారానికోసారైనా తీయకపోవడంతో దాంట్లో చెత్తాచెదారం పేరుకుపోయింది.



ఇది ధర్మపురిలోని ఆరో వార్డులోగల గిరికల కాలనీ. ఇందులో డ్రైనేజీలు లేకపోవడంతో నాలుగు వైపులా మురికినీరు ప్రవహిస్తోంది. దాదాపు 150 కుటుంబాలు జీవిస్తాయి. నూతన డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.



ఈ చిత్రం కోరుట్లలోని మెయిన్‌రోడ్డు వద్ద గల ముత్యాలవాడ కార్నర్. ప్లాస్టిక్, చెత్తతో పూర్తిగా పేరుకుపోవడంతో ఆ కాలనీ అంతా దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు స్పందించి డ్రైనేజీ తీసేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



ఈ చిత్రం జిల్లాకేంద్రంలోని గొల్లపల్లి రోడ్‌లోగల ప్రధాన డ్రైనేజీ. పూడిక నిండి చెరువును తలపిస్తోంది. చుట్టూ ఉన్న ఇళ్లలోకి దోమలు, ఈగలు చేరుతున్నాయి. ప్రజలు దుర్వాసన భరించలేకపోతున్నారు. రోడ్డును ఆనుకుని ఇష్టానుసారంగా చెత్త పడేస్తున్నారు. గాలి వీచినప్పుడల్లా రోడ్డంతా చెత్తమయంగా మారుతోంది.



ఇది రాయికల్ పట్టణంలోని బట్టివాడ వద్ద దశాబ్ద కాలం క్రితం నిర్మించిన మురికికాలువ. మరమ్మతు లేకపోవడంతో మురికి నీరంతా రోడ్డుపైకే వస్తోంది. పైప్‌లైన్ కూడా లీక్ అవుతోంది.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది మెట్‌పల్లి పట్టణంలోని వేంపేట మార్గంలో ప్రధాన రోడ్డు పక్కనున్న డ్రైనేజీ. ఇందులో వ్యర్థాలు పేరుకుపోవడం, తీయకపోవడంతో మురికినీరంతా నిండుకుపోయింది. ప్రధాన రోడ్డుపైకి వస్తుంది. దీంతో రోడ్డంతా దుర్గంధం వెదజల్లడంతో ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

### డ్రైనేజీలు నిర్మించాలి



శివారు కాలనీల్లో డ్రైనేజీలు లేక ఇబ్బంది ఎదుర్కొంటున్నాం. మురికి నీరంతా రోడ్లపైకే వస్తోంది. దీని వల్ల ఇంట్లోకి దుర్వాసన వస్తోంది. దోమల బెడద ఎక్కువైంది. అధికారులు వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

– ఆగమయ్య, మెట్‌పల్లి

### దుర్వాసన వస్తోంది



మురికికాలువలు తీయకపోవడం, డ్రైనేజీలు సక్రమంగా లేకపోవడంతో మురికి నీరంతా బయటకు వస్తోంది. అధికారులు బ్లీచింగ్ పౌడర్ చల్లించాలి. ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలి. దుర్వాసన భరించలేకపోతున్నాం.

– రమణ, కోరుట్ల

### ఏళ్ల తరబడి ఇలాగే..



డ్రైనేజీలను దశాబ్దకాలం క్రితం నిర్మించారు. కొత్త డ్రైనేజీలు నిర్మిస్తే మేలు. మురికినీరు వెళ్లక పోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. మురికికాలువలు శిథిలావస్థలో ఉండటంతో చెత్తాచెదారం పేరుకుపోతోంది.


– దేవేందర్, రాయికల్

### కాలువలు శుభ్రం చేయాలి



జగిత్యాల జిల్లా కేంద్రం కావడంతో శివారు ప్రాంతాల్లో కొత్తగా ఇళ్లు కడుతున్నారు. ఆ ప్రాంతంలో మురికికాలువలు లేక నీరంతా బయటకు వస్తోంది. ముందుగా డ్రైనేజీలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలి. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి.

– కిరణ్‌కుమార్, జగిత్యాల



# కిడ్నీలు పదిలమేనా?

కిడ్నీ.. మానవ శరీరంలో అతిముఖ్యమైన అవయవం. తినే తిండి, తాగే నీటిని వడకట్టి వడబోసి.. శరీరానికి అవసరమైన శక్తిని రక్తంలోకి, మలినాలను, వ్యర్థాలను మలమూత్రవిసర్జన ద్వారా బయటికి పంపించే ప్రక్రియను కిడ్నీ నిర్వహిస్తుంది. ఇటీవలకాలంలో జిల్లాలో కిడ్నీవ్యాధి బాధితులు పెరుగుతున్నారు. పిల్లలు, యువతను సైతం సమస్య వెంటాడుతోంది. అనేక మందికి ముందస్తు లక్షణాలు లేకపోవడం, మధుమేహం లేకపోయినా మూత్రపిండాలు పనిచేయడం ఆగిపోవడం కనిపిస్తోంది. దశాబ్దకాలంలో వేలాదిమంది మరణాలకు కారణమైన వ్యాధికి ప్రధాన కారణాలు మధుమేహం, అధిక రక్తపోటు కాగా పేయిన్ కిల్లర్స్ అధిక వినియోగం, డీహైడ్రేషన్ మరింత ప్రమాదంలోకి నెడుతున్నాయి. నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా కథనం.

– 8లో...



పబ్బతి విజయేందర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం జిల్లెల్లకు చెందిన పబ్బతి విజయేందర్‌రెడ్డి(55) వ్యవసాయం చేస్తుంటాడు. ఒకరోజు అనూహ్యంగా వాంతులయ్యాయి. కాళ్ల వాపులు వచ్చాయి. వెంటనే కరీంనగర్ వెళ్లగా రక్త పరీక్షలు చేసిన డాక్టర్లు కిడ్నీలు ఫెయిలయ్యాయని నిర్ధారించారు. విజయేందర్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని తెలిపారు. వారానికి రెండుసార్లు డయాలసిస్ చేశారు. ప్రతిసారీ రూ.5000 చొప్పున నెలకు రూ.40వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చులయ్యాయి. విజయేందర్‌రెడ్డిని ఆస్పత్రిలో అచేతన స్థితిలో చూసిన తమ్ముడు జితేందర్‌రెడ్డి(51) తన రెండు కిడ్నీల్లోని ఒక్కటి ఇచ్చేందుకు ముందుకొచ్చాడు. ఆపరేషన్ సక్సెస్ అయింది. విజయేందర్‌రెడ్డికి జితేందర్‌రెడ్డి కిడ్నీ మ్యాచ్ అయింది. అదిపని చేయడం ప్రారంభించింది. మృత్యుముంగిట అసహాయంగా చేతులు కట్టుకుని నిల్చున్న అన్నయ్యకు ఆత్మీయ రక్తబంధం పునర్జన్మనిచ్చింది.

# హామీల అమలేది..?



బీడీకార్మికులతో మాట్లాడుతున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత

సారంగాపూర్: ఎన్నికల్లో మహిళలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు ఎక్కడివరకు వచ్చిందని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ప్రశ్నించారు. మండలంలోని పోచంపేటలో బుధవారం పర్యటించి బీడీ కార్మికులతో మాట్లాడారు. కల్యాణలక్ష్మీ కింద రూ.లక్షతోపాటు తులం బంగారం హామీ ఏమైందన్నారు. మహాలక్ష్మీ కింద రూ.2500 ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. విద్యార్థినులకు స్కూటీలు, నెలకు రూ.4వేల పింఛన్ ఏది అని నిలదీశారు. బీడీ కార్మికులకు పింఛన్ ఇవ్వాలన్న ఆలోచన చేసింది ఎమ్మెల్సీ కవిత అని పేర్కొన్నారు. ఆమె వెంట పార్టీ మండలశాఖ అధ్యక్షుడు తేలు రాజు, నాయకులు గంగారెడ్డి, శ్రీనివాస్, రమేష్, మల్లేశ్, గంగాధర్ , నరేశ్, సురేశ్ మహిళలు పాల్గొన్నారు.

# పరీక్షలు ప్రశాంతంగా రాయండి

- ఎవరూ ఒత్తిడికి లోనుకావద్దు
- 'పది' విద్యార్థులతో కలెక్టర్




విద్యార్థులతో వర్చువల్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని, ఎవరూ ఒత్తిడికి లోనుకావద్దని కలెక్టర్ సత్యప్రసాద్ విద్యార్థులకు సూచించారు. జిల్లాలోని టెన్త్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో వర్చువల్ ద్వారా మాట్లాడారు. పరీక్షలంటే విద్యార్థులు భయపడొద్దని, ఉపాధ్యాయుల సూచనలు పాటించి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.అదనపు కలెక్టర్ లత మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలన్నారు. డీఈవో రాము మాట్లాడుతూ విద్యార్థులు పరీక్ష రాసేముందు ఆరోగ్య నియమాలు పాటించాలని, పార్ట్‌బీ ప్రశ్నపత్రంలో ఎలాంటి తప్పిదాలూ దొర్లకుండా చూసుకోవాలన్నారు.

**ఎల్ఆర్ఎస్ చెల్లించేలా చూడాలి**

అర్హులు ఎల్ఆర్ఎస్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. మండలాలవారీగా అధికారులతో బుధవారం సమీక్షించారు. మున్సిపల్, మండలాల పరిధిలోని ఎల్ఆర్ఎస్ దరఖాస్తు రుసుం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీపీవో మదన్‌మోహన్, టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# బ్యాంకులు రుణలక్ష్యం చేరుకోవాలి



రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న అడిషనల్ కలెక్టర్ లత, వివిధ బ్యాంకర్లు

జగిత్యాలజోన్: బ్యాంక్‌లు రుణలక్ష్యాన్ని చేరుకోవాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్.లత అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా బ్యాంక్‌ల సమన్వయ కమిటీ సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలుకు నిధుల విడుదలలో జాప్యం చేయరాదని, రానున్న మూడు నెలల్లో అత్యధిక రుణాలు అందించాలని సూచించారు. నాబార్డ్ డీడీఎం దిలీప్‌చంద్ర మాట్లాడుతూ.. ముద్ర, పీఎంఈజీపీ, ఎస్ఎస్‌జీ రుణాలను బ్యాంకులు అందిస్తున్నాయన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంకుమార్ మాట్లాడుతూ జిల్లాలో 26 బ్యాంక్‌లకు 133 శాఖలున్నాయని, వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ రుణాలు మంజూరు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ ఎల్‌డీవో పృథ్వీ, వివిధ శాఖల జిల్లా అధికారులు రాజ్‌కుమార్, నరేశ్, కిశోర్ పాల్గొన్నారు.

# యువతలో బీపీ, షుగర్

- 30ఏళ్లకే చుట్టుముట్టుతున్న వ్యాధులు
- ఎన్సీడీ స్క్రీనింగ్‌తో గుర్తింపు
- మారుతున్న జీవనశైలే కారణమంటున్న వైద్యులు
- ఒత్తిడి తీరిక లేని శ్రమతో మానసిక స్థితిపై ప్రభావం

**'జిల్లా కేంద్రానికి చెందిన నరేశ్‌కు సుమారు 30ఏళ్లు ఉంటాయి. కొద్దిరోజులుగా అధిక దాహం, అధిక మూత్ర విసర్జనతో ఇబ్బంది పడుతున్నాడు. ఇటీవల జిల్లాకేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ చేపట్టిన ఎన్‌సీడీ సర్వేలో వైద్య సిబ్బంది అతడికి పరీక్షలు చేశారు. ఇందులో నరేశ్‌కు షుగర్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. వైద్య సిబ్బంది అతడికి మందులు అందించి షుగర్ అదుపులో ఉండేందుకు సూచనలు చేశారు..' ఇది ఒక్క నరేశ్ సమస్య కానేకాదు. వందలాది మంది యువతది ఇదే పరిస్థితి.**

గొల్లపల్లి: మారుతున్న జీవనశైలితో అనేక మంది వివిధ సమస్యలతో బాధపడుతున్నారు. సరైన పోషకాలున్న ఆహారపదార్థాలను తీసుకోకపోవడం , ఒత్తిడి, నిద్రలేమి తదితర కారణాలతో అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇందులో భాగంగా యువతకు కూడా బీపీ, షుగర్ వస్తున్నాయి. వృద్ధాప్యంలో రావాల్సిన ఇలాంటి వ్యాధులు 30ఏళ్లు దాటకున్నా.. బయటపడటం కలవరపెడుతోంది. వేలాది మంది ఇలా రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలతో బాధపడుతున్నట్లు ఎన్‌సీడీ పరీక్షల్లో నిర్ధారణ అవుతోంది. ఇప్పటివరకు జిల్లాలో చేపట్టిన స్క్రీనింగ్‌లో 90,390 మందికి బీపీ, 41,140 మందికి షుగర్ ఉన్నట్లు గుర్తించారు. దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణకు జిల్లాలోని ఎన్‌సీడీ కార్నర్, క్లీనిక్‌ల ద్వారా అందిస్తున్న సేవలు విస్తృతం కావడం, పెద్ద సంఖ్యలో పరీక్షలు చేస్తుండటంతో బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఆదేస్థాయిలో చికిత్స కూడా అందుతుంది.

**వంశపారపర్యంగానూ..**

డయాబెటీస్ ఎక్కువగా వంశపార్యపరంగా.. వయసు పెరిగే కొద్ది వస్తుంది. దూమపానం, ఆల్కహాల్ తీసుకోవడం ద్వారా పాంక్రియాటిక్ గ్రంథిలో ఇన్సూలిన్ ఉత్పత్తి తగ్గి వ్యాధి లక్షణాలు బయటకు వస్తాయి. చిన్నారులు నిత్యం, టీవీ ఎదుట కూర్చొని చిరుతిళ్లు తినడం, ఎలాంటి వ్యాయామం చేయకపోవడంతో ఊబకాయం పెరిగి అధిక డయాబెటీస్‌కు దారి తీస్తుంది. చిన్న వయస్సులో ఎత్తుకంటే అధికంగా బరువు పెరగడం వల్ల రాత్రి నిద్రించే సమయంలో కొన నాలుక అడ్డుపడి నిద్రపట్టక మానసిక ఒత్తిడికి గురవుతారు.

**నిర్లక్ష్యంతో పెరుగుతున్న నష్టం..**

చాలామంది బీపీ, షుగర్ బాధితులు వాటి బారిన పడిన సంగతిని గుర్తించడం లేదు. నిర్లక్ష్యంతోనే ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. ఇటీవల కాలంలో పిల్లల్లోనూ డయాబెటీస్ లక్షణాలు బయటపడటం ఆందోళన కలిగిస్తోంది. జనులోపంతో పుట్టిన సమయంలోనే ఎక్కువగా పిల్లలకు ఈ వ్యాధి సంక్రమించే ప్రమాదం ఉంది. పదేళ్లలోపు పిల్లలు కూడా వ్యాధి బారినపడుతున్నారు. త్వరగా అలిసిపోవడం, తిన్న వెంటనే ఆకలి అనిపించడంతో పిల్లలు చదువు, ఆటలపై దృష్టి పెట్టలేకపోతున్నారు.

**పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువగా ..**

గత ఐదేళ్లలో బీపీ, షుగర్ బారిన పడిన వారిలో 40శాతం వరకు యువతే ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల వారితో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లోని వారే ఎక్కువగా మధుమేహం, రక్తంపోటు బారిన పడుతున్నట్లు గుర్తించారు. ఒక్క జగిత్యాల పట్టణంలో ఇటీవల నిర్వహించిన సర్వేలో 9,334 మంది బీపీ, 4,297 మంది షుగర్ వ్యాధితో బాధపడుతున్నట్లు తేలింది.




రోగులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

**నియంత్రణే మార్గం..**

రక్తపోటు, మధుమేహం నియంత్రణ తప్ప నివారణకు అవకాశం లేదు. ఇలాంటి వ్యాధుల కట్టడికి కేంద్రప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకం కింద నాన్ కమ్యూనికేబుల్ డీసీస్ కార్యక్రమాన్ని 2018 సెప్టెంబర్‌లో ప్రారంభించింది. 30 ఏళ్లు పైబడి రక్తపోటు, మధుమేహం గురయ్యేవారిని గుర్తించి ముందస్తుగా వారికి వైద్యసేవలు అందించడం..తద్వారా వారి ఆయుష్షను పొడిగించడం ఈ పథకం లక్ష్యం. జిల్లాలో పలు విడుతలుగా సర్వే నిర్వహించి బీపీ, షుగర్ బాధితులను గుర్తించగా సంబంధిత సెంటర్ల ద్వారా మందులు తీసుకుంటూ ఉపశమనం పొందుతున్నారు.

### జీవనశైలి మారాలి



ప్రస్తుతం 30ఏళ్లకే బీపీ, షుగర్ వస్తోంది. జీవనశైలిలో మార్పులతోనే వీటిని అరికట్టవచ్చు. యువత జంక్‌ఫుడ్‌కు అలవాటు పడటం.. వాకింగ్ చేయకపోవడంతో వ్యాధులు వస్తున్నాయి. ఆహారంలో ఉప్పు చాలా మేరకు తగ్గించి ఒత్తిడి లేకుండా జీవించాలి. నిర్ణీత సమయంలో వ్యాధిని గుర్తించి తగిన చికిత్స చేసకోవడం ద్వారా నియంత్రించవచ్చు.

– శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో

### వ్యాయామం తప్పనిసరి



ఒత్తిడి కారణంగా ఈ జబ్బులు వస్తున్నాయి. వ్యాయాంమం చేయకపోవడం... సరైన ఆహారం తీసుకోకపోవడంతో చుట్టుముట్టుతున్నాయి. పిల్లలు ఎలక్ట్రానిక్ పరికరాల ప్రభావానికి లోనవుతున్నారు. పెద్దలు యోగా చేయాలి. శారీరక వ్యాయామం లేకుంటే చిన్న వయస్సులోనే దీర్ఘకాలిక వ్యాధులబారిన పడే అవకాశం ఉంటుంది.

– అర్చన, ఎన్‌సీడీ ప్రోగ్రామింగ్ ఆఫీసర్

## క్లుప్తంగా

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


సయ్యద్ సర్వర్ పాష(ఫైల్)

పెగడపల్లి: మండలంలోని బతికపల్లిలో ఈనెల పదో తేదీన కారు ఢీకొట్టిన ఘటనలో గాయపడిన సయ్యద్ సర్వర్ పాష (55) చికిత్స పొందుతూ బుధవారం వేకువజామున మృతిచెందాడు. ఎస్సై రవికిరణ్ కథనం ప్రకారం.. సయ్యద్ సర్వర్ పాష, సయ్యద్ జాకీర్ పాష అన్నదమ్ములు. ఈనెల 10న రాత్రి సమయంలో నమాజ్ చేసేందుకు మసీదుకు నడుచుకుంటూ వెళ్తున్నారు. ఇంతలో పంగ రాజయ్య మద్యం సేవించి అతి వేగంతో కారు నడుపుతూ వచ్చి వీరిని వెనుక నుంచి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన వీరిని కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సయ్యద్ సర్వర్ పాష మృతి చెందాడు. జాకీర్ పాష పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు ఎస్సై తెలిపారు. సయ్యద్ సర్వర్ పాషకు ముగ్గురు కూమారులు సంతానం. అతడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

### మెట్‌పల్లిలో ఒకరు..

మెట్‌పల్లిరూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన లింగంపల్లి వెంకన్న(60) గత నెల 25న ద్విచక్రవాహనంపై మెట్‌పల్లి నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. మల్లాపూర్ వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు వెంకన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వెంకన్నను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటినుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకన్న పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి కుమారుడు అంజయ్య ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

### కరీంనగర్‌లో కారు ఢీకొని..

కరీంనగర్‌క్రైం: నగరంలోని సిరిసిల్ల బైపాస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. కరీంనగర్ టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం నగరంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన వాల యాద గిరిరావు (57) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. బుధవారం తన బైక్‌పై సిరిసిల్ల బైపాస్ నుంచి రాంనగర్ వైపునకు వెళ్తున్న క్రమంలో వెనక నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. రోడ్డుపైన పార్కింగ్ చేసిన లారీకి యాదగిరిరావు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### ఆర్టీసీలో బదిలీలు, పదోన్నతులు

విద్యానగర(కరీంనగర్): ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లకు బదిలీలు, పదోన్నతి కల్పిస్తూ బుధవారం బస్‌భవన్ నుంచి ఉత్తర్వులు వెలుపడ్డాయి. కరీంనగర్–2 డిపో మేనేజర్ వి.మల్లయ్యకు ఖమ్మం డిప్యూటీ ఆర్‌ఎంగా పదోన్నతి కల్పించారు. కరీంనగర్–2డిపో మేనేజర్‌గా బోధన్ డీఎం ఎం.శ్రీనివాసులును బదిలీ చేశారు. కరీంనగర్ డిప్యూటీ ఆర్‌ఎంగా బీవీ.రావు, జగిత్యాల డీఎంగా జి.సునీత, హుస్నాబాద్ డీఎం వెంకటేశ్వర్లు కుషాయిగూడకు, దిల్‌సుఖ్‌నగర్ డిపో మేనేజర్ వెంకన్నను హుస్నాబాద్‌కు బదిలీ చేశారు.

### నేడు అనభేరి వర్ధంతి

కరీంనగర్: స్వాతంత్ర్య సమరయోధుడు, నిజాం గుండెల్లో రణభేరి మోగించిన అనభేరి ప్రభాకర్‌రావు 77వ వర్ధంతిని బుధవారం నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి తెలిపారు. జిల్లాకేంద్రంలోని కూరగాయల మార్కెట్ వద్ద గల అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహం వద్ద, మహ్మదాపూర్‌లో నిర్వహించే వేడుకల్లో సీపీఐ కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.




గోదావరిలో భక్తుల స్నానాలు


ఆలయంలో భక్తుల రద్దీ


పందిరి కింద సేదతీరుతున్న భక్తులు


క్యూలైన్‌లో బారులు

## నమో నారసింహాయా..

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. సరిపడా నీడ సౌకర్యం లేక అల్లాడారు. ఎండకు తాళలేక చీరలతోనే తాత్కాలిక గుడిసెలు వేసుకున్నారు.

# కిడ్నీలు పదిలమేనా?

- విచ్చలవిడిగా పెయిన్ కిల్లర్స్ వాడకం
- ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న కిడ్నీ పేషెంట్లు
- నామమాత్రపు చికిత్సలే
- జీవనశైలీలో మార్పులు అవసరమంటున్న వైద్యులు
- నేడు ప్రపంచ మూత్రపిండాల దినోత్సవం


గోదావరిఖని జీజీహెచ్‌లోని డయాలసిస్ కేంద్రం

కరీంనగర్‌టౌన్/కోల్‌సిటీ(రామగుండం)/సిరిసిల్ల: కిడ్నీలు ప్రతిరోజు దేహంలో 200 లీటర్ల రక్తాన్ని శుభ్రం చేస్తూ, యూరియా, క్రియాటినిన్ లాంటి జీవరసాయనాలను వడపోస్తాయి. కిడ్నీల పనితీరు దాదాపు 70 నుండి 80 శాతానికి పడిపోయే వరకు బాధితులకు ఆ విషయమే తెలియదు. ఒకసారి కిడ్నీలు గనక చెడిపోతే, జీవక్రియల్లో వెలువడే ఎన్నో విషరసాయనాలు దేహంలోనే పేరుకుపోవడం మొదలవుతుంది. దీంతో ప్రాణాలకే ముప్పు తెచ్చి పెడుతుంది. అవగాహన లేమి, నిర్లక్ష్యం, విచ్చలవిడిగా పెయిన్ కిల్లర్స్ మందులు వాడకంతో ఉమ్మడి జిల్లాలో జిల్లాలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు. మూత్రపిండాలు ఒకసారి దెబ్బతింటే తిరిగి బాగు చేయటం సాధ్యం కాదు. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే పాడవకుండా చూసుకోవచ్చని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. గురువారం 'ప్రపంచ మూత్రపిండాల దినోత్సవం' సందర్భంగా కథనం.

### ఇదీ నేపథ్యం

2006లో తొలిసారిగా మార్చి 14న ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని ప్రారంభించారు. ఏటా ప్రత్యేక థీమ్ను ప్రకటించి కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా మూత్రపిండాల ఆరోగ్యం, డయాలసిస్ అవగాహన కోసం ఏటా మార్చి రెండవ గురువారం ×ప్రపంచ కిడ్నీ దినోత్సవ్ంగా నిర్వహిస్తున్నారు. ×మీ మూత్రపిండాలు బాగున్నాయా? ముందుగానే గుర్తించండి.., మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడండి..₹ అనేది ఈ ఏడాది నినాదం. కిడ్నీ వ్యాధికి సంబంధించిన ప్రమాద కారకాలు మధుమేహం(షుగర్), రక్తపోటు(బీపీ) కుటుంబంలో మూత్రపిండాల వ్యాధి చరిత్ర ఉండడమని వైద్యులు పేర్కొంటున్నారు.

### కిడ్నీల పనితీరు కీలకం

మూత్రపిండాలు మూత్రం తయారీతోపాటు రక్తం వడపోతలో కీలకంగా పనిచేస్తాయి. కణాలు ఉత్పత్తి చేసే ఆమ్లాలను (యాసిడ్)ను బయటకు పంపిస్తాయి. రక్తంలో నీరు, లవణాలు, సోడియం, కాల్షియం, భాస్వరం, పోటాషియం వంటివి సమతుల్యంగా ఉండేలా చేస్తాయి. కిడ్నీలు దెబ్బతింటే ప్రాణాలు కోల్పేయే ప్రమాదం ఉంది. సీరం క్రియాటిన్ పరీక్ష ద్వారా కిడ్నీ పనితీరును తెలుసుకునే వీలుంది. ఏడాదికోసారైనా ఈ పరీక్ష చేయించుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, రక్తపోటు, మధుమేహం, అధిక బరువు వంటివి తలెత్తకుండా చూసుకోవాలి. ధూమపానం, మద్యపానం మానుకోవాలి. పుష్కలంగా నీరు తాగాలి, వ్యాయామం చేయాలి. ఉప్పు తక్కువ తీసుకోవాలి. అధికంగా మాంసం తీసుకోవద్దు. ఆహారంలో సగభాగం పీచు పదార్థాలు ఉండేలా చూసుకోవాలి. నొప్పి గోళీలు, అనవసరంగా స్టెరాయిడ్స్ వాడకూడదు.

- ఉమ్మడి జిల్లాలో మూత్రపిండ వ్యాధిగ్రస్తుల సంఖ్య ఏటా పెరుగుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యరంగంలో కిడ్నీ బాధితులకు నామమాత్రపు వైద్య సేవలు అందుతున్నాయి. స్థానికంగా ప్రైవేటు రంగంలో నెఫ్రాలజిస్టులు ఉన్నప్పటికీ సదుపాయాల కొరతతో రోగులు పెద్ద నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ప్రభుత్వ వైద్యశాలల్లో నెఫ్రాలజీ, యూరాలజీ విభాగాలు లేవు. చికిత్స మాత్రమే అందిస్తున్నారు.
- గోదావరిఖని జీజీహెచ్‌తోపాటు పెద్దపల్లి జిల్లా ఆస్పత్రి, మంథని ప్రభుత్వాస్పత్రుల్లో ఐదు మిషన్లు చొప్పున మూడు డయాలసిస్ కేంద్రాలున్నాయి. ఆరోగ్యశ్రీ పథకం కింద జీజీహెచ్‌లో రోజుకు 16 మందికి నాలుగు షిఫ్టుల ద్వారా నెలలో 40మందికి, పెద్దపల్లిలో రోజుకు 15 మందికి మూడు షిఫ్టుల చొప్పున నెలకు 33 మంది పేషెంట్లకు, మంథనిలో రోజుకు తొమ్మిది మందికి ఒక షిఫ్టులో నెలలో 9మంది పేషెంట్లకు డయాలసిస్ చేస్తున్నారు.
- రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా 95మంది కిడ్నీలు (మూత్రపిండాలు) ఫెయిల్ అయి డయాలసిస్‌పై జీవిస్తున్నారు. వందలాది మంది సకాలంలో వైద్యం అందక, కిడ్నీ అందించే రక్తసంబంధీకులు ఎవరూ ముందుకు రాక.. ప్రాణాలు కోల్పోయారు.
- కరీంనగర్ జిల్లా ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. జిల్లా ఆస్పత్రితో పాటు నగర శివారులో ఉన్న రెండు వైద్యకళాశాలల్లో సైతం డయాలసిస్ సేవలు ఆరోగ్యశ్రీ ద్వారా అందిస్తున్నారు.

### పెయిన్ కిల్లర్స్ తీసుకోవద్దు



ఈ మధ్య చాలా మంది పేయిన్ కిల్లర్స్, ఇతర హానికరమైన మందులను విచ్చలవిడిగా మింగుతున్నారు. డాక్టర్ సలహా లేకుండా ఎలాంటి మందులను వాడకూడదు. నాటు వైద్యం జోలికి వెళ్ల కూడదు. జీవన శైలిలో మార్పులు, ఆహారపు అలవాట్లు, వంశపారంపర్య రుగ్మతలు కిడ్నీ వ్యాధులకు కారణం. సంపూర్ణ ఆరోగ్యం కోసం మన జీవనశైలిని మార్చుకోవాలి.
– కుందరాపు గోపికాంత్, యూరాలజిస్టు, గోదావరిఖని

### లక్షణాలు తెలియడం లేదు



చాలా మంది వ్యాధి ముదిరే వరకు లక్షణాలు తెలియపోవడం వల్ల పరిస్థితి విషమించిన తర్వాత వైద్యం కోసం వస్తున్నారు. తగ్గని జ్వరం, కాళ్లు, ముఖం వాపులు, యూరిన్‌లో ప్రొటీన్లు పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స తీసుకోవాలి. అశ్రద్ధ చేయడం వల్ల ప్రాణాలకే ప్రమాదం ఏర్పడవచ్చు.
– రాంచందర్ తొర్రైం, నెఫ్రాలజిస్టు

# హలో..1912

- టీజీఎన్పీడీసీఎల్‌లో ఎమర్జెన్సీ రీస్టోర్ టీం
- అంబులెన్స్ తరహాలో విద్యుత్ నిలిచిన లొకేషన్‌కు..
- ఆరుగురు సభ్యుల బృందంతో విద్యుత్ పునరుద్ధరణ పనులు


ఆరుగురు సభ్యులతో కూడిన ఎమర్జెన్సీ రీస్టోర్ టీం, మొబైల్ వాహనాలు

కొత్తపల్లి(కరీంనగర్): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, తక్షణ సేవలందించాలనే లక్ష్యంతో టీజీఎన్‌పీడీసీఎల్ కొత్త సంస్కరణలకు శ్రీకారం చుడుతోంది. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆస్పత్రికి చేర్చేందుకు వినియోగిస్తున్న అంబులెన్స్‌ల మాదిరిగా విద్యుత్ అంతరాయాలను నివారించేందుకు సంస్థ మొబైల్ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. 24/7 వినియోగదారులకు అందుబాటులో ఉండేవిధంగా సంస్థ కార్యాచరణ రూపొందించింది. విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు వినియోగదారుడు 1912కు సమాచారం ఇస్తే.. ఆ వాహనం లొకేషన్‌కు చేరుకొని మరమ్మతులు చేపడుతుంది. ఈ సేవలను కరీంనగర్ సర్కిల్‌లో అధికారులు అందుబాటులోకి తీసుకొచ్చారు.

### తక్షణ పరిష్కారానికి ఎమర్జెన్సీ టీం

ప్రకృతి వైపరీత్యాలు, సాంకేతిక సమస్యలు, బ్రేక్ డౌన్ వంటి విద్యుత్ అంతరాయాలు ఏర్పడినప్పుడు విద్యుత్ సంబంధిత సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించేందుకు ఎమర్జెన్సీ రిస్టోర్ టీం పనిచేయనుంది. ఈ మోబైల్ వాహనంలో విద్యుత్ మెటీరియల్‌తో పాటు థర్మో విజన్ కెమెరాలు, రంపాలు, టార్చ్‌లైట్లు, నిచ్చెనలు, ఇన్సులేటర్లు, కండక్టర్లు, కేబుల్స్ వంటి పరికరాలను అందుబాటులో ఉంచారు.

### నాణ్యమైన విద్యుత్ అందించేందుకు



వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయాలు లేని విద్యుత్‌ను అందించేందుకు సంస్థ అనేక ప్రణాళికలు ప్రవేశపెడుతోంది. అంబులెన్స్‌ల మాదిరిగానే విద్యుత్ సంస్థ మొబైల్ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. అందులో ఆరుగురు సభ్యులతో ఎమర్జెన్సీ రిస్టోర్ టీంను ఏర్పాటు చేసింది. 24/7 అందుబాటులో ఉండే ఈ సేవలను వినియోగదారులు వినియోగించుకోవాలి. విద్యుత్ సంబంధిత సమస్యలు తలెత్తినప్పుడు తక్షణమే 1912కు ఫోన్ చేస్తే సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.
– మేక రమేశ్‌బాబు, ఎస్‌ఈ, కరీంనగర్

## ఆన్‌లైన్ పెట్టుబడిదారుడి ఇంటి ఎదుట ఆందోళ


పెట్టుబడిదారుడి ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

జగిత్యాలక్రైం: జగిత్యాలలో ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెట్టించి తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తి ఇంటిముందు బాధితులు బుధవారం ఆందోళన చేపట్టారు. జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి కొడిమ్యాలకు చెందిన కొంతమంది నుంచి సుమారు రూ.70 లక్షల వరకు ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టించాడు. కొంతకాలంగా ఆన్‌లైన్ పెట్టుబడి వ్యాపారం మూతపడటంతో తమకు తమ డబ్బులు చెల్లించాలని బాధితులు కోరుతున్నారు. వారికి పొంతన లేని సమాధానాలు చెబుతూ వచ్చిన సదరు వ్యక్తి తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో బాధితులు ఆయన ఇంటి ముందు ఆందోళనకు దిగారు. పోలీసులు సంఘటనస్థలానికి వచ్చి బాధితులతో మాట్లాడి స్టేషన్‌కు తీసుకెళ్లారు. అదే సమయంలో పెట్టుబడి పెట్టించిన సదరు వ్యక్తి రావడంతో బాధితులు అతడితో వాగ్వాదానికి దిగారు.

## తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు


గాయపడ్డ శ్రీనివాస్‌గౌడ్

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ బుధవారం తాటిచెట్టు పైనుండి కింద పడిపోవడంతో గాయాలయ్యాయి. స్థానికుల కథ నం ప్రకారం.. శ్రీనివాస్ గౌడ్ వృత్తిలో భాగంగా తాటికల్లు గీస్తుంటాడు. ఎప్పటిలాగే చెట్టు ఎక్కుతుండగా మోకు తెగిపోవడంతో చెట్టుపై నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నాడు.

## భార్య చేతిలో భర్త హతం


తాళ్ల రాజన్న మృతదేహం

కోరుట్ల: మేడిపల్లి మండలం కొండాపూర్ గ్రామంలో తాళ్ల రాజన్న(55)ను అతని భార్య లక్ష్మీ హత్య చేసింది. మద్యానికి బానిసైన రాజన్న కొంతకాలంగా భార్యను వేధిస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి కూడా మద్యం తాగివచ్చి గొడవ పడ్డాడు. దీంతో సుమారు రాత్రి 10.30 గంటల సమయంలో ఆమె గొడ్డలితో అతనిపై దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై శ్యాంరాజ్ పరిశీలించారు.

## గ్రామపంచాయతీలో కల్లు తాగిన యువకుడు


టేబుల్‌పై కల్లు బాటిల్, గ్లాసు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): గ్రామపంచాయతీ కార్యాలయం తాళం పగులగొట్టి ఏకంగా కార్యాలయంలో కల్లు తాగి, దూమపానం చేసిన యువకుడి వీడియో బుధవారం సామాజిక మాధ్యమాల్లో చెక్కర్లు కొట్టింది. తంగళ్లపల్లి మండలం సారంపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి ఒక యువకుడు తాళం పగులగొట్టి పంచాయతీ కార్యదర్శి కార్యాలయంలోకి ప్రవేశించాడు. దర్జాగా కార్యదర్శి టేబుల్‌పై కాళ్లు చాపుకుని, అదే టేబుల్‌పై కల్లు బాటిల్, గ్లాసు పెట్టుకుని సేవించాడు. ఈ తతంగాన్ని అంతా మరో యువకుడు వీడియో తీయడంతో వెలుగుచూసింది. కాగా సదురు యువకుడిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి బుధవారం తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. యువకుడిపై కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

## రేషన్‌బియ్యం పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

- 79.50క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

గోదావరిఖని: మంథని నుంచి మహారాష్ట్రకు పీడీఎస్ రైస్‌తో తరలివెళ్తున్న డీసీఎం వ్యాన్‌ను బుధవారం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రమేశ్‌బాబు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫైవింక్లయిన్ వద్ద వ్యాన్‌ను పట్టుకుని రైస్ తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. డీసీఎం వ్యాన్‌లో ఉన్న 79.50 బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితులు మంథని శ్రీపాదకాలనీకి చెందిన దేశెట్టి మారుతిని అదుపులోకి తీసుకున్నామన్నారు. పట్టుకున్న బియ్యం విలువ సుమారు రూ.3.08లక్షలు ఉంటుందన్నారు. మరో ముగ్గురు నిందితులు మంథనికి చెందిన రాచర్ల రమేశ్, సిరొంచకు చెందిన యెల్లంకి వీరన్, మంథనికి చెందిన ఓదెల మహేందర్ పరారీలో ఉన్నారని అన్నారు. తదుపరి విచారణ కోసం గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించినట్లు వెల్లడించారు.

## విదేశాలకు పంపిస్తానని మోసం చేసిన వ్యక్తిపై కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామానికి చెందిన జైశెట్టి రాకేశ్‌ను విదేశాలకు పంపిస్తామని మోసం చేసిన అల్లెపు వెంకటేశంపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వేణుగోపాల్ తెలిపారు. రాకేశ్‌ను విదేశాలకు పంపిస్తానని మాయమాటలు చెప్పి 2022లో రూ.3 లక్షలు, రూ.50 వేలు ఫోన్‌పే ద్వారా తీసుకున్నాడు. 2023 ఆగస్టులో అర్మీనియా దేశం పంపించగా.. అక్కడ రాకేశ్‌కు ఉద్యోగం లేక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. మోసపోయానని తెలుసుకుని తిరిగి వచ్చాడు. ఈ నేపథ్యంలో ఏజెంట్ వెంకటేశం మళ్లీ మాయమాటలు చెప్పి జనవరి 12న థాయిలాండ్ దేశానికి పంపించాడు. అక్కడి నుంచి బ్యాంకాక్‌కు తీసుకెళ్లి సరైన ఉద్యోగం చూపించకుండా సైబర్‌క్రైమ్ ముఠాకు అప్పగించాడు. వారు సైబర్ నేరాలు చేయాలని రాకేశ్‌పై ఒత్తిడి పెంచడంతో ఆయన తిరిగి స్వయం వచ్చాడు. మాయమాటలు చెప్పి మోసానికి పాల్పడిన అల్లెపు వెంకటేశంపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## కోరుట్లలో పట్టపగలే దొంగతనం

- రూ.4 లక్షలు, రెండున్నర తులాల బంగారం చోరీ


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కోరుట్ల: పట్టణంలోని రాంనగర్ ప్రాంతంలో బుధవారం పట్టపగలే దొంగలు తాళం వేసిన ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. పట్టణానికి చెందిన ఐలారం పద్మ బట్టల దుకాణం నడుపుతోంది. కూతురు ఇంటర్ పరీక్ష రాసేందుకు వెళ్లగా.. పద్మ ఇంటికి తాళం వేసి దుకాణానికి వెళ్లింది. పద్మ కూతురు పరీక్ష రాసి ఇంటికి తిరిగి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా.. బీరువా తాళాలు కూడా పగులగొట్టి, వస్తువులు చిందరవందరగా ఉన్నాయి. వెంటనే తల్లి పద్మకు సమాచారం ఇవ్వగా ఆమె వచ్చి బీరువాలోని రూ.4 లక్షలు, రెండున్నర తులాల బంగారం అపహరణకు గురైనట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై రాంచంద్రం గౌడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

## పరీక్ష కేంద్రంలో విద్యార్థినిపై పడిన ఫ్యాన్



కరీంనగర్ కాశ్మీర్‌గడ్డలోని ఓ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష రాస్తుండగా శివాన్విత అనే విద్యార్థిని తలపై సీలింగ్ ఫ్యాన్ ఊడి పడింది. కన్ను, ముక్కుకుపై గాయాలయ్యాయి. పరీక్ష కేంద్రంలో ఉన్న ఏఎన్‌ఎంలు ప్రథమ చికిత్స చేశారు. పరీక్ష సమయం వృథాకావడంతో విద్యార్థినికి మరో 30నిమిషాలు అదనంగా సమయం ఇచ్చారు. విషయం తెలుసుకున్న సీపీ గౌస్ ఆలం వచ్చి విద్యార్థినిని పరామర్శించారు. ఈ ఘటనపై కేంద్రం ఎదుట విద్యార్థి సంఘాలు ఆందోళన చేయడంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

## కామదహనం


వేములవాడ: రాజన్న సన్నిధిలో బుధవారం రాత్రి కామదహనం వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ మహాద్వారం వద్ద ఇన్‌చార్జి స్థానాచార్యులు ఉమేశ్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.